# వంచిత

''నమస్కారం డాక్టరమ్మగారూ'' ఏదో మెడికల్ జర్నలు చూసుకుంటున్న పావని తలెత్తింది. నుదుట పావలా కాసంత తోపురంగు కుంకుమ బొట్టు. వెంకట గిరి జరీ చీర.కాస్త కాస్త నెరుస్తున్న తలా- చాల పరిచితమయిన మొహంలా అనిపించింది.

## వాణీరంగారావు




''కూర్చోండి'' అంది డాక్టర్ పావని.

అప్పుడు కనిపించింది ఆమె వెనకాల పద్ధెనిమిది పంథొమ్మిదేళ్ళ పిల్ల. చక్కని కను ముక్కు తీరు. మంచి రంగు. నొక్కు జుట్టు. చూడగానే చక్కని పిల్ల అనిపిస్తుంది. మొహంలో ఏదో దిగులు. అస్పష్టంగా పావని ''రామ్మా కూర్చో'' అంది. పెద్దావిడ ''కూచో'' అంది.

ఇద్దరూ కూర్చున్నారు.

''నన్ను మీరు గుర్తు పట్టలేదా?'' నవ్వుతూ అడిగింది. పావని సందిగ్ధంగా తలవూపుతూ ''ఎక్కడో చూసినట్లుంది...'' అంది.




''అవున్లెండి. ఎంత మందో- మీ పేషంట్లు. ఇన్నేళ్ళుగా...'' అవునన్నట్లు నవ్వుతూ తల పంకించింది పావని.

''నేను సుందరమ్మనండీ. 66లో మావారిక్కడ తాసీల్దారుగా పని చేసేటప్పుడు మీ దగ్గరే ట్రీట్‌మెంట్ తీసుకునే వాళ్ళం. మా అత్తగారుకూడా పక్షవాతం వచ్చి పోయారు ఇక్కడే...''

''ఆ... గుర్తొచ్చారు. మీ పేరు జ్ఞాన సుందరి కదూ. మీ వారి పేరు...''

''నారాయణమూర్తి.''

''ఆ... బావున్నారా! చాలాకాలమైంది చూసి. ఈ పాప...'' భావగర్భితంగా చూసింది పావని సుందరమ్మ వైపు.

అవునన్నట్లుగా తలవూపి ''అవును! మా పాపే. పేరు కూడా మీరే పెట్టారు. అభిలషిత అని.''

''అవునవును. ఏమ్మా ఏం చదువుతున్నావు?''

''బి.ఎ. ఫస్టియరండీ'' సన్నని గొంతు. శ్రుతుల పొరలు చీల్చుకుని దీనంగా ఓ అర్తనాదం పావని గుండెల్ని తాకింది.

పావని విశాల నయనాల్లో నీటి పొర.

''అభీ! కాసేపు బయట బల్ల మీద కూచుంటావా?'' అంది సుందరమ్మ గారు.''ఆ!ఆ! వద్దు ఇక్కడే ఉండనీయండి. మనమే లోపలికి వెళ్దాం'' లేవబోయిన అభిలషతను ఆపి తను లేచింది కుర్చీలోంచి.

ఎక్జామినేషను రూంలోకి వెళ్ళారిద్దరూ. పావనికి లాంటి ప్రయివసీ చాల అవసరం. సాధారణంగా ఆడ పేషంట్లు తమకు వచ్చిన ఏ ఇబ్బందినీ ఇతర్ల ముందు పెట్టడానికి ఇష్టపడరు. అలా కనీసం డాక్టరు ముందు కూడా పెట్టకుండా ప్రాణం మీదికి తెచ్చుకున్న సంఘటనలు ఆమె అనుభవంలో చాలా ఉన్నాయి. అందులోనూ మెనోపాస్ (బహిష్ఠు ఆగిపోయే సమయం) స్టేజ్‌లో వున్న వాళ్ళకు రకరకాలైన ఇబ్బందులు ఎదురవుతాయి. అలాంటివే ఏవో కంప్లయింట్లయి వుంటాయి అనుకుంది పావని.

''ఏమిటమ్మా ప్రాబ్లం చెప్పండి'' అంది పావని.

తలొంచుకు నిలబడ్డ ఆమె కళ్ళల్లోంచి నీటి బిందువులు రాలి పడటం గమనించింది పావని. మూపుడు వేలితో గడ్డం పైకెత్తి, ''ఏమ్మా! ఎందుకు కన్నీళ్ళు. సమస్యేమిటో దాని పరిష్కారమేవిటో చూసుకోవాలి గానీ! ఛ ఛ. తప్పు కదూ!'' అనునయించింది పావని. ''ఏమయింది అసలు-చెప్పండి''

ఉండబట్టలేనంత దుఃఖం ముంచుకొచ్చింది సుందరమ్మకి. పమిట వెంగు అడ్డం పెట్టుకుని ఉప్పెనలా వస్తున్న ఏడుపును దిగమింగింది సుందరమ్మ.

''మీకు గుర్తుండే వుంటుంది. అభి పుట్టడం...''

''అవునవును గుర్తుంది'' ఒక్కసారిగా ఇంచుమించు 20సంవత్సరాలనాటి సంఘటనలన్నీ కళ్ళ ముందు తిరిగాయి.

** ** ** **

స్వర్ణశలాకలా వున్న సుమతిని తీసుకుని జానకి

రామయ్యగారు డాక్టరు పావని దగ్గరకువచ్చారు. స్కూలు టీచరుగా పని చేస్తున్న జానకి రామయ్యగార్కి సుమతి మూడో సంతానం. సుమతి పుట్టిన నాలుగేళ్ళకి తల్లి పోయింది. అయినా విధవ అక్కగార్ని పెట్టుకుని ముగ్గురు పిల్లల్ని పెంచుకొచ్చారు. పెద్దది లక్ష్మి. బావమరిది విష్ణుమూర్తికిచ్చి చేశారు. వాళ్ళ కాపురం మూడు పూలూ ఆరు కాయలుగా వుంది. రెండోవాడు రామం. వాడు బి.ఇడి చేస్తున్నాడు. మూడో పిల్ల సుమతి. బి.ఎ. మొదటి సంవత్సరం చదువుతోంది.

జానకి రామయ్యగారి కుటుంబం అంతా పావని దగ్గరే మందులు తీసుకుంటారు. ఆ యింటి వాళ్ళంటే పావనికి అభిమానం ఎక్కువ. వచ్చే సంపాదనలో అసంతృప్తి అనేది లేకుండా నిత్యం శోభతో ఉండే సంసారం అది. భార్య లేదన్న దిగులు కానీ, ఆ లోటుగానీ ఎక్కడా పైకి కనపడనీయకుండా యింటిని లాక్కొస్తున్నాడాయన. ఏనాడూ వెర్రి అనేదే ఉండేది కాదు వాళ్ళ మొహాల్లో. అలాంటిది... పావని మనసులో సందేహాలు.

వణుకుతున్న చేతుల్తో కళ్ళనిండా నీళ్ళతో జానకి రామయ్యగారు ''అమ్మా! డాక్టరమ్మ తల్లీ. నా బిడ్డ బ్రతుకు...'' అంటూ బావురుమనేటప్పటికి పావనికి విషయం అర్థమై పోయింది.

''బాధపడకండి మాస్టారూ! నేనున్నానుగా'' పావని ఓదార్చింది. జానకి రామయ్యగారికి కొండంత అండ దొరికినట్లయింది.

''తల్లి లేని పిల్ల అమ్మా! ఏం జరిగిందో ఏమో! ఏమీ చెప్పడం లేదు. నాలుగు రోజులయింది. ఊరి నించి వచ్చి. దిగులుగా ఉంటుంది. సరిగ్గా అన్నం తినడం లేదు. గట్టిగా గదిమితే గుడ్లనీళ్ళు గుడ్లను కుక్కుకుంటోంది.''

''నేను కనుక్కుంటాలెండి. మీరిలా కూర్చోండి. సుమతీ రామ్మా లోపలికి రా!'' అంటూ లోపలికి తీసుకెళ్ళింది.

''ఏమ్మా సుమతీ! ఏం జరిగింది. చెప్పు. నీకేం భయం లేదు. నేను నీ అక్కలాంటిదాన్ని. చెప్పమ్మా!'' బుజ్జగించగా బుజ్జగించగా సుమతి నోరు విప్పింది.

మవునంగా శోకదేవతలా-శిలలాగా-ఘనీభవించిన ఆ దుఃఖం కరిగి కరిగి పోతోంటే-నిస్త్రాణగా గోడకు చేరగిలబడి పోయింది సుమతి.


సుమతి అక్క లక్ష్మికి పురుడు పోయడానికి మేనత్తతో పాటు సుమతి కూడా అక్కగారి ఊరు వెళ్ళింది -అక్కడ... అక్కడ... అక్క మొగుడి అవసరం- సుమతి బేలతనం-అవకాశం- సుమతి మీద అఘాయిత్యం చేశాయి. ఇంతవరకూ ఎవరితోనూ ఏమీ చెప్పలేదు.

నాలుగు రోజుల్నాడు వచ్చిన మేనకోడలి వాలకం పెంచిన మేనత్తకు సందేహం కలిగించింది. దానికి తోడయింది ఆమె అనుభవం. పిల్లని అడగడానికి జంకి అన్నగారి చెవిన వేసింది. ఆయనకు అసలు ఆలోచించడానికే భయం వేసి పావని దగ్గరకు తీసుకొచ్చాడు-

''ఎన్ని మాసాలు మిస్ అయ్యాయమ్మా!''

''అయిదు.''

''అయిదా! ఇన్నాళ్ళా ఏం చేశావు?'' కొంచెం



## తలనొప్పి లెన్నెన్నో, చికిత్స ఒకటి!




# శక్తివంతమైన విశ్వసనీయమైన అనాసిన్

అనాసిన్‌లో భాధ నివారక ఔషధాలు వున్నాయి— వాటిని మరి ప్రపంచమంతటాగల డాక్టర్లు ఎక్కువగా సిఫార్సు చేస్తారు. అందుకే తలనొప్పి నుంచి వెంటనే ఉపశమనం పొందడం కోసం కేవలం అనాసిన్ వేసుకుంటే చాలు.

తలనొప్పి మాత్రమే కాదు, జలుబు, పడిశం, ఫ్లూ, వెన్నునొప్పి, కాళ్ళనొప్పులు, పంటినొప్పి వీటికికూడా యిది పనిచేస్తుంది.

**సురక్షితమైన ఫాయిల్ ప్యాక్‌లో**

అంటే మీ డాక్టరుగారి మందే యిక

**అనాసిన్***

భారత దేశపు నం. 1 నొప్పిని నివారించే ఔషధం

* Licensed user of T.M. Geoffrey Manners & Co. Ltd. GM-DL-85-TI



సినీ వార పత్రికనే చదవండి!

జ్యోతిచిత్ర

సినీ వార్తలకు, సుందర చిత్రాలకు


కోపం వచ్చింది బాధ్యత లేని తనానికి.

"నాకు తెలీలేదు"

అవును. ఏం చెప్తుంది! ఆ పిల్లకు ఎలా తెలుస్తుంది? నెలసరి కాకపోతే తనలో మరో జీవం ప్రాణం పోసుకుంటోందనా? తెలియ నివ్వం గదా! సెక్స్ అంటేనే పాపం అనుకునే సమాజంలో ఉన్న మనం ఇలాంటి చీకటి తప్పుల్ని మాత్రం కడుపున దాచుకుంటాం. విశృంఖలంగా సెక్స్ సాహిత్యాన్ని ఉద్రేక పరిచే నీచ కళల్ని కళా రూపాల పేరిట ప్రదర్శిస్తాం. వాటిని చదివీ చూసీ నిగ్రహించుకునే ఆత్మ సంయ మనం నేర్చుకోమని ప్రసంగాలిప్పిస్తాం. వేదాంతం బోధిస్తాం. కాని యుగ యుగాలుగా జరిగేది జరుగుతూనే ఉంది.

ఉవ్వెత్తున వచ్చిన కోపం క్షణంలో జారి పోయింది. పావనిలోని విజ్ఞత ఆమెను జాగృతం చేసింది. కర్తవ్య నిర్వహణ డాక్టర్లకు ప్రథమ వృత్తి నీతి.

"నీకు పరీక్షలెప్పుడూ!"

"ఇంకా ఆరు నెలలున్నాయి"

జరపాల్సిన పరీక్షలన్నీ జరిపింది. జానకి రామయ్య గారికి ఈ విషయం ఎలా చెప్పాలి? చెప్పాక ఆయనని ఎలా ఓదార్చాలి. ఇలాంటి కేసులు ఇంతవరకూ చెయ్య లేదు పావని. ప్రాక్టీసు పెట్టి ఆరేళ్ళయినా ఎందుకో ఇలాంటి సమస్యలు తనకెదురవలేదు. అయినా జానకి రామయ్యగారు మానసికంగా ప్రిపేర్ అయివచ్చినట్లే కనిపిస్తుంది -' అనుకుంటూ కన్సల్టేషన్ రూంలోకి అడుగు పెట్టింది.

చేతికర్ర మీద రెండు అరచేతులూ ఆన్చి గడ్డం దాని మీద ఉంచి మధ్య మధ్య కారుతున్న కన్నీటిని పంచతో తుడుచుకుంటూ- సర్వం కోల్పోయి- స్మశానం దగ్గర చితి మంటల్ని చూస్తూ ఆ మంటలు కళ్ళలో ప్రతి ఫలిస్తూంటే -మనిషి కరిగి నీరై దుఃఖం ఆ గదంతా ఆవరించుకున్నట్లు ఉంది-


చిన్నగా దగ్గింది తన ఉనికిని తెలియపర్చడానికి అన్నట్లు పావని. చివాలున తలెత్తాడాయన. ఆ కళ్ళల్లో చిన్న ఆశ. చితి మీది నించి ఆ ప్రాణి లేచి వస్తోందా అన్నట్లు-

తన కుర్చీలో కూర్చుంది పావని.

నిశ్శబ్దం. ఇద్దరు వ్యక్తుల మధ్య నిశ్శబ్దం. అత్యంత దుఃఖ సమయంలోనూ అత్యంత ఆనంద సమయం లోనూ. పావని 'తాను ఒక డాక్టరునని మర్చిపోయానా?' అని అనుకుంటూ తనని తను కంట్రోల్ చేసుకుంది.

డాక్టరుకీ-లాయరుకీ- పోలీసు అధికారికీ-స్పందించే హృదయముండాలే గానీ-కోటాను కోట్ల సార్లు ఆ గుండె ఒత్తిళ్ళకులోనయి తూట్లు పడి మూడో వంతు ఆయుర్దాయం తగ్గిపోయే ప్రమాదముంది. అన్ని దయ నీయమైన సంగతులు దొరుకుతాయి. అంత బాధా కరమైన ముగింపులుంటుంటాయి.

"మాష్టారు! మీరేం వర్రీ కాకండి. అమ్మాయిని నేను చూసుకుంటాను. కాకపోతే ఓ అయిదు నెలల పాటు అమ్మాయిని వేరే వూరికి పంపించేద్దాం. ఊహాఁ అంటే నేనే తీసుకెళ్తాను" ఆగి ఆయన మొహం చూసింది పావని. నిస్సహాయత. దీనత్వం. ఎన్నో




ప్రశ్నలు... ఎన్నో ప్రశ్నలు.

"మాస్టారూ! మీరు పెద్దవారు. మీకు చెప్పగల్గిన దాన్ని కాదు గానీ...మీరిలా దిగులు పడిపోతే ఎలా చెప్పండి. సమస్యలు లేకపోతే అసలు జీవితమేముంది? మనం ఇవాళ కొత్తగా చూస్తున్న సమస్య కాదుగా యిది. అనాదిగా స్త్రీ ఎదుర్కొంటున్నదే. ఈ రోజు మన ఒళ్ళో పడింది గనక కాలకుండా ఆర్పేసుకోవాలి. అవునా!"

"అంతే...అంతే..."

"[illegible]

కదా! అక్కడ జరిగింది పొరపాటు."

"అంటే...అంటే"

"మీ పెద్దల్లుడు... బావమరిది అనుకుంటాను"

"అవునమ్మా బావమరిదే" పై పంచలో మొహం దాచుకుని బావురుమన్నాడాయన.

ఓ ! ఆడపిల్లా! నీ మ ట్టూ ఎంత గట్టి బంధం- నీ మీద ఎంత గురుతరమైన బాధ్యత? ఈ సమాజం ఎంత గొప్ప స్థానం నీకిచ్చిందో చూడు!

అయినా అంతగా కల్మషాన్ని పుద్దుతోంది నీ మీద. [illegible]

పోలేదేమోననిపించింది పావనికి.

"వదిలేయండి మాస్టారూ! మీ కుటుంబంతో చాలాకాలంగా పరిచయం ఉన్న మనిషిగా చెప్తున్నాను. ఇవాళ అతన్నీ అల్లరి పెట్టలేము. అక్కడ బాధపడేదీ మీ పెద్దమ్మాయే కనక. ఒక వేళ బయట పెట్టి అల్లరి చేస్తే ఏమయినా సుమతి జీవితానికి ఉపయోగమా అంటే అదీ కుదరదు గదా! అందుకని..." ఆశగా చూశారు జానకి రామయ్యగారు.

"మరో విషయం చెప్పాలి మీకు. అమ్మాయి అమాయకత్వంతో లేట్ చేసింది. అయిదో మాసం వచ్చేసింది. ఇప్పుడిక అబార్షన్ చెయ్యాలంటే అంత మంచిది కాదు. అయిదంటోంది గాని ఆరు వచ్చిందని నా అనుమానం. జాగ్రత్తగా పురుడు పోసి ఆ బిడ్డ బాధ్యత నేను చూసుకుంటాను. అది తప్ప మరి మరో మార్గం లేదు" అంది పావని.

"అంతా నీ దయ తల్లీ. నన్నీ గండం నించి బయట పడెయ్యి" అంతకంటే ఆయన నోట మాట రాలేదు.

ఆ తరువాత మేనత్తను పిలిపించి జాగ్రత్తలు చెప్పడం, టైఫాయిడ్ జ్వరం అని చెప్పి పావనిని తన గైనకాలజీ ప్రొఫెసర్ డాక్టరు యశోధర గారి ఊరు తీసు కెళ్ళడం అయిదారు రోజులలో జరిగిపోయింది.

అసలు పావని అభిప్రాయం డాక్టర్ యశోధర అబార్షన్ చేయవచ్చు అంటే అబార్షన్ చేసేద్దామని. కాని ఆమె కూడా ఒప్పుకోకపోవడంతో అక్కడే పురుడు [illegible]




పావని వెళ్ళింది.

కొన్ని దశాబ్దాల అనుభవంతో డాక్టరు యశోధర తీసుకున్న జాగ్రత్తలు శ్రద్ధగా పరిశీలించింది.

కన్నెపిల్లకీ కన్న తల్లికీ ఉండే సున్నితమైన శరీర మార్పులు రాకుండా సాధ్యమైనంతగా జాగ్రత్తలు తీసుకున్నారామె. డాక్టరు యశోధర ఆదరణలో సుమతి తప్పక కోలుకుంటుందనే నమ్మకంతోనే అక్కడ చేర్పించింది పావని. పావని అంచనాలు తప్పలేదు.

అక్కడే జరిగింది ఓ చిత్రం.

సంవత్సరం క్రితం పావని దగ్గర ట్రీట్‌మెంట్ తీసుకుంటూ ఉంటే జ్ఞాన సుందరి గారి భర్తకు ట్రాన్స్‌ఫరై యశోధర గారి ఊర్కు వచ్చారు.

జ్ఞాన సుందరికి పెళ్ళై పది హేను సంవత్సరాలు. పిల్లలు కలగలేదు. ఎంతో ట్రీట్‌మెంటు తీసుకున్నా ఆమెకు నెల తప్పలేదు. డాక్టరు యశోధర గారి దగ్గర డి అండ్ సి. ఆపరేషను చేసుకుని భర్తా భార్యామందులు తీసుకున్నాక గర్భవతైంది. సరిగ్గా సుమతి ప్రసవానికి ముందు రోజు ప్రసవించింది జ్ఞాన సుందరి. కాని బిడ్డ బ్రతకలేదు సరి కదా గర్భ సంచే తీసెయ్యాల్సి వస్తుందేమోనన్నంత కష్టమైంది కాన్పు. జ్ఞాన సుందరికి సిరికి లోపం లేదు. విషాదానికి ఆమె జీవితంలో తావేలేదు.

కానీ ఈ బాధ ఎవరూ తీసేయ గలిగింది కాదు. ఎవరూ ఈ కొరత తీర్చ గలిగిందీ కాదు.

సుమతి నొప్పులు పడుతోంది. కాన్పుల గదికి పక్క రూంలో సుందరి ఖాళీ ఉయ్యాలను కన్నీళ్ళతో చూస్తూ పడుకుని ఉంది. సుమతి కేకలు సుందరి గుండెల్లో ప్రతిధ్వనిస్తున్నాయి. తిరిగి జన్మించడమంటే ఇదే. ఉత్కృష్టమైన మానవజన్మ- సత్యమూ సార్వకాలీనమూ అయిన మాతృత్వంలో పునీతమవుతుంది. అసలీ మాతృత్వ మనే మహోన్నత మయిన వరం ఈ జన్మలో తనకు దొరుకుతుందా- సుందరి మనసులో కొండంత వేదన. ఎన్నో ఆశలతో తీర్చి దిద్దుకున్న అతి సుందరమైన పూలతోటకాలి పోయింది. ఇక ఈ బూది కుప్పలలోంచి చిన్న కుసుమమైనా పుష్పిస్తుందా! సుందరి గుండెలు బరువై దుఃఖం భరించ లేక పోతూంది. ఎగసి ఎగసి పడ్తున్న దుఃఖంతో పురిటి మంచం మీద పడుకున్నదల్లా లేచి కూర్చుంది- చేతుల్లో ఒడి నిండా పాపాయి కన్పిస్తోంది. మాయమై శూన్యం కన్పిస్తోంది. పాల బరువుతో రొమ్ములు భారంగా ఉన్నాయి. సుందరికి లోకం అంతా చీకటిగా శూన్యంగా ఉంది. ఆమె లోకంలో ఆమె ఉంది.

కేర్ కేర్ మన్న పసి పాప ఏడుపు సుందరి చీకటి లోకానికి ఉషోదయంలా తోచింది. కలలు కంటున్న కళ్ళల్లో క్రమంగా నీటి పొరలు మాయమై వింత కాంతి.

ఒక పావు గంట గడిచింది. లేబర్ రూం తలుపులు తెరుచుకుని బయటకు వచ్చింది యశోధర. తెల్లని జుట్టు తెల్లని చీర జాకెట్టులో చేతుల్లో అప్పుడే విరిసిన జాజి పూవులాంటి పాపాయితో దేవలోకం నించి నడిచొస్తున్న దేవిలా- సుందరి కళ్ళు ఆమె కూర్చున్న తీరు- యశోధర అనాలోచితంగానో- సాలోచనగానో ఆ పాపాయిని పూల గుత్తిలా సుందరి ఒడిలో వేసింది.



?

ఒక్క పొర తీసి
వాడు నా సిగ్గు పొరొక్కటే తీసి
వొంటిమీద వొంద చూపులద్ది-
నా కేసి,
తన వూహల కేసి,
ఎన్నిసార్లు చూసుకుంటాడె
వాడిలో
వాడెన్ని సార్లు తలపోసుకుంటాడె!

మరొక్క పొర తీసి
అమ్మమ్మొ వాడు
కనిపించే అందాలను
నా వొంటిపై వాడి కనిపించే అందాలను,
తన జ్ఞాపక రూపాలను-
మార్చి మార్చి, పోల్చి పోల్చి
ఎన్నిసార్లు
తనలో తా నెన్నిసార్లు చూసుకుంటాడె!

వొళ్ళంతాతమ కంతో వూగుతుంటె,
పట్టు తప్పిపోతుంటె
పరువం చెయ్యి జారిపోతుంటె
కళ్ళన్నొ తెరుచుకోవు, ఓయమ్మొ
నా కళ్ళన్నొ తెరుచుకోవు
చూపులతో వూనుకుందామంటె!

—స్పృహ

అసంకల్పిత ప్రతీకార చర్యగా గుండెలకు హత్తుకుని తన్మయురాలైపోయింది సుందరి. బాహ్యస్మృతి లేనంతగా లీనమైన ఆ మాతృమూర్తిని ఆ పునీత భావనామయ జగత్తు నుంచి దూరం చేయాలని పించలేదు యశోదరకు.

అంతే. అలా సుందరి బిడ్డగా పునర్జన్మించింది ఆ పాప. అభిలషిత పేరు పావనే పెట్టింది.

ఆమె వెనుక కన్నతల్లి సుమతి చనుబాలు కన్నీరై ప్రవహించినా, డాక్టరు యశోధర హృదయంలో ఆ అమ్మకి అన్యాయం జరుగుతోందనే ఘోష రగిలినా, పావని మెదడులో స్త్రీకి జరుగుతున్న తరతరాల ఈ అన్యాయాన్ని ఎదిరించమని విప్లవం రేగుతున్నా-

మెత్తలు పరచి తొట్టిలో పసి కూన నుంచి-కన్నీరు జోలపాటగా గంగలో పేగు తెంచుకు పుట్టిన పాపడిని వదుల్తున్న తల్లి కుంతి- సర్వసృష్టిలోని స్త్రీత్వపు వేదన - బాధ రూపుదాల్చి విశ్వరూపం దాల్చి నిల్చింది పావని కళ్ళ ముందు.

అలా సుందరి అభిలషిత తల్లయింది.

సుందరి ఇప్పుడు సుందరమ్మగా దర్శనమిచ్చింది.

** ** ** **

ఒక్క క్షణంలో పావని మనసు గతాన్ని తడిమి వర్తమానంలోకి వచ్చింది.

సుందరమ్మ చెప్పకు పోతూంది.

"అభి తరవాత నాకు పిల్లలే పుట్టలేదమ్మా. దాన్నే కంటికి రెప్పలాగా కాచుకున్నాము. చాలా బుద్ధిమంతురాలే మరి. క్లాస్‌మేట్‌ట —ప్రేమిస్తున్నానేటప్పటికి మోసపోయింది."

"పోనీ పెళ్ళి చెయ్యడానికి ప్రయత్నించక పోయారా?"

"లేదమ్మా! అతను చాలా చెడిపోయిన కుర్రాడు. కులం- డబ్బు-హోదా-ఇవన్నీ సర్దుకు పోవచ్చుగానీ, ఇప్పటికే తాగుబోతూ తిరుగుబోతూ అని పేరు పడ్డ కుర్రాడు. వాడికిచ్చి చేసి దీని బతుకు బండలు చెయ్యాలని లేదు డాక్టరమ్మా! అందుకే ఇక్కడికి తీసుకొచ్చాను. రెండు నెలలు దాటాయి. ఎలాగోలా ఈ కాస్త భారం దింపేస్తే ఇక దాన్ని జాగర్తగా చూసుకుంటానమ్మా!" అంటూ కళ్ళ నీళ్ళు తుడుచుకుంది సుందరమ్మ.

"అమ్మాయి ఏమంటూంది మరి?"

"ఏమంటుంది. ఏడుస్తుంది"

"అతన్నే చేసుకుంటానని పట్టుపట్టలేదా?"

"ఊహు! వాళ్ళ నాన్నగారు వాడ్ని గురించి వాకబు చేయడం, అతని గురించి వచ్చిన రిపోర్టులు అన్నీ తనూ స్వయంగా విన్నదీ చూసింది. అంతే కాదు. అక్కడికీ ఆ కుర్రాణ్ణి అడిగితే చాల తేలిగ్గా సమాధానం చెప్పాడట. అంతగా ఆ చెడిపోయిన దాన్ని చేసుకోవాలంటే ఉన్న ఆస్తంతా నా పేర పెడతారేమో కనుక్కోమన్నాడట. అలాంటి వాడికి పిల్లనివ్వడమంటే గొంతు కొయ్యడమే నని మానుకున్నాం. అది కూడా అదే నిర్ణయాని కొచ్చింది" అంటూ కళ్ళు తుడుచుకుంది సుందరమ్మ గారు.

కాలానికి కత్తుల వంతెన కట్టుకున్న సమాజం ఇది.

తరానికీ తరానికీ మధ్య చిత్ర విచిత్రమైన అంతరాలు. చిత్ర విచిత్రాలైన మార్పులు- మారనిది ఒక్కటే- స్త్రీ-

పావని గుండెల్లో శిలువను మోస్తున్న క్రీస్తు-ఎదురు తిరిగి ప్రశ్నిస్తున్న సవ్వడి- మీరంతా పవిత్రులేనా! మీరంతా పవిత్రులేనా!
వంచితులంతా పవిత్రులే. అవును పవిత్రులే.